### కాంగ్రెస్, బీజేపీల

# విష ప్రచారాన్ని నమ్మొద్దు



పాదయాత్రకు తరలివచ్చిన అశేష జనవాహిని



నృత్యాలు చేస్తున్న కార్యకర్తలు



విజయ చిహ్నం చూపుతున్న ఎమ్మెల్సీ కవిత, బిగాల

- గణేశ్‌గుప్తాను గెలిపిద్దాం .. నగరాన్ని కాపాడుకుందాం
- రోడ్‌షోలో ఎమ్మెల్సీ కవిత, బిగాల గణేశ్‌గుప్తా

ఖలీల్‌వాడీ, నవంబర్ 28 : పట్టణాభివృద్ధిలో మరింత దూసుకెళ్లాలంటే బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి బిగాల గణేశ్‌గుప్తాను గెలిపించుకుందామని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా అర్బన్ అభ్యర్థి బిగాల గణేశ్ గుప్తాతో కలిసి నగరంలో మంగళవారం నిర్వహించిన రోడ్‌షోలో పాల్గొని మాట్లాడారు. గణేశ్‌గుప్తాను గెలిపించుకుందాం, నిజామాబాద్‌ను కాపాడుకుందామన్నారు.పదేండ్ల బీఆర్‌ఎస్ హయాంలో సీఎం కేసీఆర్ ఆశీర్వాదంతో జిల్లా అద్భుతంగా అభివృద్ధి చెందిందన్నారు. ఐటీ హబ్ ఏర్పాటు చేసి అంతర్జాతీయ స్థాయి కంపెనీలను తీసుకొచ్చామని, దాంతో దాదాపు 1500 మందికి ఉపాధి లభిస్తోందన్నారు. కర్ణాటకలో ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ గ్యారంటీలను అమలు చేస్తామని బాండ్ పేపర్‌పై సంతకాలు చేసిందని, కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ ప్రజలను మోసం చేసిందని విమర్శించారు. పోలింగ్‌కు ఒకరోజు మాత్రమే మిగిలి ఉన్న నేపథ్యంలో ప్రతిపక్షాలు దుష్ప్రచారాలు చేస్తాయని, తప్పుడు మాటలు మాట్లాడుతారని, వాటిని నమ్మవద్దని కోరారు.పిల్లల భవిష్యత్తుపై ఆలోచించి బీఆర్‌ఎస్ పార్టీకి ఓటేయాలని విజ్ఞప్తి చేశారు. బీడీ కార్మికులతో సహా అన్ని రకాల పెన్షన్లను రూ. 5వేలకు పెంచాలని, కటాఫ్ డేట్‌తో సంబంధం లేకుండా బీడీ కార్మికులందరికీ పెన్షన్లు ఇవ్వాలని, పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం పేరిట నెలకు రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ సంకల్పించారని వివరించారు. ఎన్నికలు పూర్తయిన వెంటనే రేషన్ కార్డులను సరిదిద్ది కొత్త కార్డులు జారీ చేసిన తర్వాత రైతు బీమా తరహాలో పేదలకు రూ. 5 లక్షల మేర కేసీఆర్ రక్ష పేరిట బీమా పథకాన్ని అమలు చేస్తామని, రూ.15 లక్షల వరకు ప్రైవేట్ దవాఖానల్లో వైద్యం చేయించుకునే సౌకర్యాన్ని కల్పించాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. కేసీఆర్ మూడోసారి సీఎం అయిన తర్వాత రైతుబంధు మొత్తం రూ.16 వేలకు పెరుగుతుందని ఎన్నికల తర్వాత రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తుందన్నారు. రూ.400లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారన్నారు. రానున్న ఐదేళ్లలో పెద్ద ఎత్తున ఇండ్ల నిర్మాణం చేపడుతామని తెలిపారు. గణేశ్‌గుప్తాను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు.

**ప్రజల మధ్య చిచ్చుపెట్టే వార్తలను నమ్మొద్దు**

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బిగాల గణేష్‌గుప్తా మాట్లాడుతూ నగరంలో తొమ్మిదేండ్లలో బ్రహ్మాండంగా అభివృద్ధి పనులు జరిగాయన్నారు. 9 సంవత్సరాలుగా నిజామాబాద్ ప్రశాంతంగా ఉందని, మీ అందరికి తెలుసని, ఎలాగైనా గెలవాలని కుల మతాల మధ్య చిచ్చు పెడుతున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీలు ఒక్కటై డ్రామాలు చేస్తున్నాయని.. గొడవలు సృష్టించి ఓట్లు దండుకోవాలని చూస్తున్నాయని దుయ్యబట్టారు. రెండు పార్టీల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ గెలుస్తుందని దేశంలోని అన్ని సర్వే సంస్థలు చెబుతున్నాయన్నారు. అభివృద్ధిని ఆదరిస్తూసంక్షేమాన్ని కొనసాగించడం కోసం నగరం శాంతియుతంగా ఉండడం కోసం కారు గుర్తుకు ఓటు వేసి అధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నగర మేయర్ దండు నీతూకిరణ్, మాజీ మేయర్ ఆకుల సుజాత, సుజిత్‌సింగ్ ఠాకూర్, రవిచందర్, సత్యప్రకాష్ పాల్గొన్నారు.

---

### ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా

## ఓటు హక్కును వినియోగించుకోవాలి

**విలేకరుల సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 30న జరగనున్న పోలింగ్‌లో ప్రతి ఓటరు పాలు పంచుకొని, స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు పిలుపునిచ్చారు. జిల్లా పరిధిలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని వెల్లడించారు. కలెక్టరేట్‌లో మంగళవారం సీపీ కల్మేశ్వర్‌తో కలిసి విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి కౌంటింగ్ కోసం చేపట్టిన విషయాలను వెల్లడించారు. ఓటరు కార్డు లేకపోయినా, ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర 12 రకాల గుర్తింపుకార్డును వెంట తెచ్చుకుని ఓటు వేయవచ్చని సూచించారు.

**ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు..**

ఈనెల 30న ఉదయం 7 నుంచి సాయంత్రం 5 గంటల వరకు పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. జిల్లాలో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు, అన్ని నియోజకవర్గాల పరిధిలో ప్రచార కార్యక్రమాలు చేపట్టామని చెప్పారు. తక్కువ పోలింగ్ నమోదైన నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించామని తెలిపారు. ఆరు నియోజకవర్గాల పరిధిలో 833 ప్రాంతాల్లో మొత్తం 1,549 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని, జిల్లాలో 13,94,989 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న 7215 మంది, ఇతర జిల్లాల్లో విధులు నిర్వర్తిస్తున్న 648 మంది పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు హక్కును వినియోగించుకున్నారని తెలిపారు. ఎన్నికల తనిఖీల సందర్భంగా ఇప్పటివరకు రూ. 89,40,799 విలువ చేసే మద్యంతోపాటు రూ.4.15కోట్ల నగ దు, రూ. కోటి పైచిలుకు విలువ చేసే బంగారు అభరణాలు, ఇతర వస్తువులను సీజ్ చేశామని వివరించారు.

**159 కేసులు నమోదు..**

ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘనకు సంబంధించి మొత్తం 159 కేసులు నమోదు చేశామని సీపీ కల్మేశ్వర్ వెల్లడించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించేలా 3000 పైచిలుకు మందితో అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భద్రతా ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద సాయుధ బలగాలను మోహరిస్తామన్నారు.

---

# ముగిసిన ప్రచారం

- మూగబోయిన మైకులు, డీజేలు
- జిల్లాలో 144 సెక్షన్ అమలు
- మద్యం షాపులు బంద్.. వైన్స్‌షాపుల్లో నో స్టాక్..

ఖలీల్‌వాడి, నవంబర్ 28 : అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ప్రచారంలో భాగంగా కొన్ని రోజులుగా హోరెత్తించిన ప్రచార రథాలు, మైకులు, డీజేలు మూగబోయాయి. ఈ నెల 30న పోలింగ్ ఉండడంతో 48 గంటల ముందు ప్రచారాన్ని నిలిపివేయాలన్న ఆదేశాల మేరకు వివిధ పార్టీల అభ్యర్థుల మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ప్రచారం చేశారు. రోడ్లపై డీజేలు, మైకులు మూగబోయాయి. దీంతో జిల్లా అంతటా నిశబ్దం ఆవరించింది. నెల రోజులుగా అభ్యర్థులు ప్రచారాలతో జిల్లాలోని తొమ్మిది నియోజకవర్గాల్లో సందడి చేశారు. జిల్లాలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు ప్రజల్లోకి వెళ్లి విస్తృత ప్రచారం చేశారు.

ఎన్నికల్లో భారీ విజయం సాధిస్తారని అభ్యర్థులు ధీమా వ్యక్తం చేశారు. సీఎం కేసీఆర్ అమలుచేస్తున్న రైతుబంధు, రైతుబీమా, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, 24 గం టల విద్యుత్ సరఫరా, పెన్షన్ల పంపిణీ తదితర పథకాలు ఆయా నియోజకవర్గాలో చేపట్టిన అభివృద్ధి తమకు శ్రీరామరక్షగా నిలుస్తాయని వారు నమ్ముతున్నారు.

**జిల్లాలో 144 సెక్షన్ అమలు..**

జిల్లాలో ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ 144 సెక్షన్ విధించారు. జిల్లాలో మూడు రోజుల పాటు వైన్ షాపులు బంద్ ఉంచాలని ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ప్రత్యేక బృందాలతో పకడ్బందీ నిఘా ఏర్పాటు చేశారు. పోలింగ్, కౌంటింగ్ ఏర్పాట్లలో అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు.



ప్రచారం ముగియడంతో నిలిచిపోయిన ప్రచార రథాలు



ఖాళీ అయిన వైన్స్

**జిల్లాలోని నియోజకవర్గాల వారీగా పోలింగ్ కేంద్రాలు, ఓటర్ల వివరాలు**

| నియోజకవర్గం | పోలింగ్‌స్టేషన్లు | పురుషులు | స్త్రీలు | ట్రాన్స్‌జెండర్లు | మొత్తం |
|---|---|---|---|---|---|
| ఆర్మూర్ | 217 | 96404 | 109933 | 07 | 206344 |
| బోధన్ | 246 | 103577 | 112381 | 05 | 215963 |
| బాన్సువాడ | 258 | 92225 | 100608 | 08 | 192841 |
| నిజామాబాద్ అర్బన్ | 289 | 139163 | 147571 | 32 | 286766 |
| నిజామాబాద్ రూరల్ | 293 | 116052 | 132212 | 05 | 248269 |
| బాల్కొండ | 246 | 99728 | 115898 | 02 | 215628 |
| **మొత్తం** | **1549** | **6,47,149** | **7,18,603** | **59** | **13,65,811** |

### 30న వేతనంతో కూడిన సెలవు

నిజామాబాద్ స్పోర్ట్స్, నవంబర్ 28:ఎన్నికల నేపథ్యంలో 30న పోలింగ్ సందర్భంగా ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేతనంతో కూడిన సెలవును ప్రకటించిందని ఎన్నికల అధికారి రాజీవ్‌గాంధీ హన్మంతు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం అన్ని ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు, పరిశ్రమలకు వేతనంతో కూడిన సెలవు దినంగా ప్రకటించాలని తెలిపారు. పోలింగ్ కేంద్రాలుగా, డిస్ట్రిబ్యూషన్ సెంటర్లుగా వినియోగిస్తున్న విద్యాసంస్థలు, ప్రభుత్వ సంస్థలకు ఈ నెల 29న కూడా సెలవు దినంగా ప్రకటించారు.